
ఈ వారం తెలుగు పుస్తకం

# పద్యారామ విహారం

శివలింగం




**Title:** Padyaaraamam
**Author:** Rama Brahmam Betavolu
**Subject:** LITERARY CRITICISM
**Year of Publication:** 2004
**Price:** USD $ 2.31

ప్రాచీనకవిత్వాన్ని పఠించకుండా ఛందః శిల్పం తెలియకుండా పద్య కవిత్వాన్ని రాయలేరు. భావానికి అనుగుణమైన భాషను ఉపయోగించే నేర్పు ఉండాలి. వివిధ ఛందస్సుల్లో పద్యాలు రాసిన ఆధునికులే వచన కవిత్వమూ రాయగలిగారనడంలో సందేహం లేదు. ఆధునిక కవిత్వాన్ని అందరూ ఆదరించారు. పద్యాల్లోనే వేయి పూలు పూశాయి. ద్రాఘ్ఠిక సమాస రచన, భాషాభేషజం, విపరీతాలంకారాలు తగ్గిపోయి, అలతి అలతి పదాల కూర్పుతో, చక్కని సందేశంతో జిగితో బిగితో పద్యకావ్యాలల్లిన కవులెందరో ఆధునిక కవులలో మనకు కనిపిస్తారు. పద్య కవిత్వం భాషాభివృద్ధికి అవరోధమూ కాదు, భావప్రకటనకు ఆటంకమూ కాదు. భావవ్యక్తీకరణ సామర్థ్యం, నైపుణ్యం, ఛందస్సులో ధారాశుద్ధి వున్న వాడికి పద్యం హృద్యంగానే వుంటుంది. కవి అయినవాడికి అధ్యయనం, అభ్యాసం ముఖ్యంగా వుండాలి.

ఆచార్య రామబ్రహ్మంగారు పద్యకవుల్ని ప్రోత్సహిస్తూ, వెన్ను తట్టి తలెత్తుకునే విధంగా పద్యకవిత్వాన్ని తలకెత్తుకున్నారు. వారి పద్యారామం ఇటీవలి పద్యకృతులపై విమర్శ వ్యాసాలు. పద్యారామంలోకి ప్రవేశిస్తే రకరకాల పద్యాల పూల చెట్ల అందాలను వెలికి తీసి చూపిస్తారు.సుగంధ పరిమళాలు వెదజల్లేవి కొన్ని, రాజకీయ ప్రబోధాలు కొన్ని, హృదయపరివర్తన కలిగించేవి మరికొన్ని. కావ్యాలు మనమూ చదువుతాం. కాని వాటి అందచందాలను, గుణదోషాలను, ఔచిత్య అనౌచిత్యాలను, ప్రాస అనుప్రాసలను, యతి భంగాలను వెంటనే గుర్తించలేం. వీటన్నిటినీ వొదిలేసినా 'దీని భావమేమి తిరుమలేశా' అని ఆలోచింపనీయకుండా వివరించి చెపుతారు. ఈ పని ఇంతకు ముందు '*నన్నయ నుంచి కంకంటి దాకా*' పుస్తకంలో చేసారు. ఇది ప్రాచీన కవుల కవితా వ్యాఖ్యానాలకు సంబంధించినది. 'పద్యారామం' ఆధునిక పద్య కావ్యాల విమర్శ. కావ్యంలోని శబ్దజాలం ద్వారా భాషాశక్తి సంప్రదాయాలు, శిల్పం, కావ్య పరమార్థం, కవి హృదయం విశదీకరించటం విమర్శ. కవి ఉద్దేశానికీ, దాన్ని వ్యక్తీకరించే శబ్దసంపదకూ ఉన్న అనుబంధాన్ని నిరూపించే విమర్శకుడే సహృదయుడు. నిరంతర కావ్యానుశీలన వలన మనసు అద్దంలాగ ఏర్పడి, వర్ణ్య వస్తువుతో

తన్మయీభావ యోగ్యత కలిగినవాడే సహృదయుడు. ఆచార్య రామబ్రహ్మంగారు సహృదయ విమర్శకుడు. పద్యాన్ని బతికించడానికి పూనుకున్నారనడం సరికాదు. పద్యం చచ్చిపోతేగా బతికించడానికి. పాఠకుల తిరస్కారానికి గురైన పద్యాన్ని పాఠకుల అభిమానాన్ని చూరగొనడానికి గాను వెలువడుతున్న పద్యాల అందాలను ఆవిష్కరించడానికి నడు కట్టారు ఆచార్యుల వారు. శీర్షికలు కూడా ఆకర్షణీయంగా పెట్టారు. పూర్వం అక్కిరాజువారు తొలకరి జడకుచ్చులు వంటి పద్య కావ్యాల పేర్లను హేళన చేసారు. తత్వశాస్త్ర గ్రంథాలకు కూడా అందమైన పేర్లు పెట్టారనేది మరచిపోయారు.

అపారమైన పాండిత్యమున్నా చక్క చక్కని సులభశైలిలో చెప్పడం వారి ప్రత్యేకత. చదవాలనిపించే గుణం వుంది వారి శైలికి.

పద్యారామంలోకి అడుగుపెట్టగానే కావ్యశ్రీ సంధించిన 'బ్రహ్మాస్త్రాలు' కావ్యపరిచయం... 11జనవరి 99 తో ప్రారంభమై సామాజిక శతకం ఈశ్వర సంప్రశ్నం 29 మే 2000 తో ముగింపు. అనుబంధాలు నాలుగుతో కలుపుకుని మొత్తం 74 శీర్షికలు.

ప్రస్తుత రాజకీయ పరిస్థితిని వివరించి వాటిలోని దోషాలను చూపించి ఏం చేస్తే రుగ్మతలు తొలగి పోతాయో వివరించే కావ్యం 'బ్రహ్మాస్త్రాలు'. రాజకీయ సిద్ధాంతాలన్నిటిలో ప్రజాస్వామ్యం మంచిదంటారు. కాని అది గుంపుకు యిచ్చిన విలువ గుణానికియ్యదు. అందుకే కావ్య ఆకాంక్ష మంచిదైనా చాలా పేచీలు, యిబ్బందులు, సమస్యలు తెలత్తుతాయని చెపుతూ వున్న పరిస్థితి మారాలి అన్నంత వరకు అందరూ అంగీకరిస్తారని తేల్చి చెప్పారు.

'సంప్రదాయ బద్ధంగా చదువుకుని ఆధునిక సమాజాన్ని సాహిత్యాన్ని చాలా సన్నిహితంగా అధ్యయనం చెయ్యడంవల్ల కలిగే ఒకసమగ్రత ఒక పరిపూర్ణత బులుసు వెంకటేశ్వర్లు రచించిన మువ్వ పలుకుల్లో వినిపిస్తుంది. ఏ ఒక్కటీ స్వయంసంపూర్ణమూ సర్వాత్మనా నిర్దుష్టమూ కాదు అనే అవగాహన ధ్వనిస్తుంది( పు-6)

దళిత కథా కావ్యం ఆనందమోహిని (10 పే) లో ఆధునిక వచన కవిత్వం కథను పూర్తిగా వదిలి పెట్టేసిందన్నారు. కుందుర్తి వచన కథాకావ్యాలు రావాలని ఎంతో ఆశ పడ్డాడు. శీలా వీర్రాజు కొడిగట్టిన సూర్యుడు వంటివి వచ్చినా తేనె పెఅలా సృష్టించలేకపోయారు. పద్యాల్లో వస్తూనే వున్నాయి. ఇది దళిత యువకుని ప్రేమ కథ. దళిత అనే పదం కొత్తది కాదు. పాళీ నుంచి వచ్చింది. పాళీలో దళిద్ధ అనే పదం ఆ అర్థంలో ఉపయోగిస్తారు. అస్పృశ్యులనే పదం బదులు హరిజనులని గాంధీ పేరు పుట్టాడు. దాన్ని తిరస్కరించి దళిత పదాన్ని స్వీకరించారు. 1972 దళిత పాంథర్స్ మేనిఫెస్టోలో దళిత పదాన్ని నిర్వచించారు. మతం పేరుతో రాజకీయంగా ఆర్థికంగా దోపాడీకి గురైన స్త్రీలు, పేదరైతులు, శ్రామికులు, నవబౌద్ధులు, షెడ్యూలు తెగలు జాతులకు చెందినవారు దళితులు అన్నారు. దళిత సాహిత్య పత్రిక అస్మితాదర్స్ సంపాదకుడు, దళిత రచయిత గంగాధర్ పంతవాణె రాస్తూ దళిత అంటే కులం కాదు. మార్పుకు విప్లవానికి ప్రతీక. దళితునికి మానవతా వాదం మీద విశ్వాసం ఉంది. భగవంతుడు, పునర్జన్మ, ఆత్మ, పవిత్ర గ్రంథాలు- వీటి అస్తిత్వాన్ని తిరస్కరిస్తాడు. వివక్షతను బోధిస్తాయి శ్రుతులు. మానవుడిని బానిసగా రూపొందిస్తాయి అని వివరించాడు. 'ఆనందమోహిని' రచయిత గుర్రం ధర్మోజీరావుగారు కాలేజీ తెలుగు ఉపన్యాసకులు. సంస్కృతం చదువుకున్నారు. దాన్నితెలుగులో

కలుపుకోవడం సరిగా కుదరలేదన్నారు. శృంగార వర్ణనలో వీరు చూపిన ప్రబంధాల ఘాటు ఈనాటికి సరిపడదనడం నిజం. మంచి కావ్యం అయితే మెచ్చుకోవడమే కాదు తప్పక ఆదరిస్తారని అభయమిచ్చారు. ఎవరు రాసారన్నది కాదు,రాశాడన్నది ముఖ్యం. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన భాషా శాస్త్రవేత్త ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తిగారిని రాయల్ సొసైటి ఆఫ్ ఎడింబరో ఫెలో ఎంపిక చేసి గౌరవించింది. ఈ ఏడాది అత్యున్నత పురస్కారం అందుకున్న ఏకైక భారతీయుడు. అంతటి మేధావి చిన్నప్పుడు కవితా లోకంలో విహరించి పద్యాలు గిలికారని విని ఆశ్చర్యం కలిగింది. తరువాత తప్పిపోయి భాషాశాస్త్రవేత్త అయ్యాడు. 13-23 సంవత్సరాల మధ్య కాలంలో రాసిన పద్యాల్ని చిన్ననాటి పద్యాలు పేరుతో ప్రకటించారట యథాతథంగా. ఈనాటి కవిత్వం కాదు.అవధాన కవిత్వం గురించి, ఆధవునికాంశలు గురించి రాశారు. అదొక పద్య క్రీడ. అవధాని పాండిత్యానికి సంబంధించిన పద్యాలు. వాటిని యిప్పుడు పుస్తకరూపంలో కూడా తీసుకువచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. కావలసింది మేధస్సును మెప్పించే కావ్యాలు కాదు హృదయాన్ని వొత్తే కవిత్వాలు కావాలి.

ప్రజావాణిలో ప్రబోధించిన వాటిని ధైర్యంగా ఆచరణలోకి తెమ్మనడమే కావ్యధ్వని, కవితల పరమార్థం అన్నారు. మానవాళికి మంచి కాలం వస్తుందన్న ఆశ కనుచూపుమేరలో కనిపించడంలేదు. రాజకీయాలను భ్రష్టు పట్టిస్తున్నారు. నైతిక విలువలకు పద్యంలోనే పట్టం కడుతున్నారు. తిలక్ అనుకుంటా నీతిని వొదిలితే గాని రాజనీతి కాదన్నాడు. జీవితంలో జరిగే సంఘటనలనీ సమాజంలో కనిపించే ఎగుడు దిగుడులన్నీ మనసు నుంచి చూడగలగడం నిజంగా మంచి సాత్వికత. ఇది ఆలంకారికుల సాత్వికత, తాత్వికులు చెప్పింది కాదు. అని మనసు కవయిత్రి నాయని కృష్ణకుమారి రాసిన మానసలీల కావ్యం గురించి చెప్పిన మాటలు. కృష్ణకుమారిగారు తెలుగు పాఠకులకు చిరపరిచితురాలు..మంచి కవిత్వం రాసారు. యొక్కలతో తెలుగు భాషకు బొక్కలు పెట్టొద్దని వారన్నారు. అన్నిటికీ మూలం మనస్సు.అదొక ప్రవాహంలా అదొక ప్రవాహంలా, తైలధారలా అవిచ్ఛిన్నంగా సాగిపోతూవుంటుంది. చిత్తవృత్తి ని నిరోధించాలంటే ధ్యానమే శరణ్యం. మన పెద్దలంతా మనస్సును పంచేంద్రియాలూ కలసి దాని ఆట కట్టించిన పుడే శాంతి లభిస్తుందంటారు.అరుదైన ఆధ్యాత్మిక స్పృహ కృష్ణకుమారి కవిత్వంలో గోచరిస్తుంది. కృష్ణకుమారి గారి మానస లీల మనస్సుల మీద ఒక చెరిగిపోని ముద్ర వేస్తుంది. తండ్రికి తగ్గ తనయ అన్నారు.

అనువాదకుల అగచాట్లను తెలిపారు (64 పే). అనువాదాలను ఆంగ్లంలో Transcreation అంటున్నారు. అదేమిటో మన తెలుగు కవిత్వం అనువాదంతోనే ఆరంభం. స్వతంత్ర రచనలు ఒకటీ రెండూ వున్నా వాటికి ఏదో ఒక మూలం వెతికారు. తెలుగు కవుల కావ్యాల్లో సంస్కృతం నుండి అనువదించినవి చాలావాటిని చూపించారు ఆచార్యులవారు. తెలుగు కవిత్వం తరువాత వచ్చిన ఆంగ్ల సాహిత్యం తెలుగువాఙ్మయం కన్నా పెద్దది. సృజనాత్మక రచనలు కోకొల్లలు. తెలుగు కవిత్వంలో విశ్వ సాహిత్యంలో నిలబడగలిగిన రచనలు తక్కువేనని తెలిసినవారంటారు. పూర్వకవులు సంస్కృతం బాగా నేర్చిన వారు గనుక సంస్కృతంలో కావ్యాలనుంచీ అరువు తెచ్చుకున్నారు. ఆధునికులు ఆంగ్లం నేర్చుకుని ఆంగ్ల కవిత్వం నుండీ దిగుమతి చేసుకున్నారు. ఇతర భాషల్లో వచ్చిన కవితల్ని 'పలుకు చిలుక ' పేరుతో ఆచార్యుల వారు పద్యాల పేరుతో అనువదించారు. మనకు చదువుతూ వుంటే అనువాదమనిపించదు.

చిన్న చిన్న ఖండ కావ్యాల్లో మంచి కవిత్వాన్ని అందిచారే గాని చెరుకుగడల్లాంటి కావ్యాలను అందించలేకపోవడం మన దురదృష్టం. రసరాజు కవిత ఆర్ద్రత కు ఆనవాలు. అనుభూతికి ఓనమాలు. పల్లా దుర్గయ్యగారి 'గంగిరెద్దు' ప్రతీకాత్మక కావ్యమన్నారు.కర్షక స్వామికి కవితాభిషేకం చేసినవారు గంగుల సాయిరెడ్డి. (పే79) తెలుగులో మొట్టమొదటి కర్షక కవి పోతన అన్నారు.భాగవతంలోని దశమ స్కంధము, ఎర్రాప్రెగడ హరివంశంలోని పూర్వ భాగం, గీత గోవిందాలను పాస్టొరల్ పొయిట్రీగా కట్టమంచి వారు దువ్వూరి 'కృషీవలుడు' కావ్య పీఠికలో వివరించారు. ఈనాడు వ్యవసాయ వృత్తిమీద ఆదరంగాని అభిమానం గానీ లేదు. రైతుల ఆత్మహత్యలమీద కూడా రాస్తే బాగుండేదనుకుంటే ప్రచురణకాలం యాభై గదా!

నీతి పద్య రచనకు ఆటవెలది అనుకూలం. వేమనగారు ఆటవెలదితో ఆడుకున్నాడు. మాల్యశ్రీగారు నండూరివారి ఆటవెలదులకు మకుటం లేదు. అనారోగ్యానికి లోనై ఆసుపత్రిలో చేరిన ఒకరిద్దరు వచన కవులు గొప్ప ఆధ్యాత్మిక భావాలతో కవితలు రాశారు. నండూరివారు ఈ వ్యాధికి ఈ శక్తి వుంది అనే రహస్యాన్ని ఏనాడో గమనించారని అంటూ నీరసంగా ఉన్న తత్త్వశాస్త్ర అధ్యయన శాఖల్ని ప్రభుత్వ ధర్మాసుపత్రులకు వైద్య కళాశాలలకు అనుబంధాలుగా తరలిస్తే మహత్తరంగా ఉంటుందని ఆలోచనాపరులు ఒక నిర్ణయానికి రావచ్చని చమత్కరిస్తారు. ( పే 97)

అన్ని వాదాలకూ పద్యం ఒదిగింది. హేతువాదానికీ పద్యాన్ని ఆశ్రయించారు. చెప్పిన భావాలనే మళ్ళీ మళ్ళీ చెప్పడం కనిపిస్తుంది. ఆటవెలదుల్లో సమాజంలోని మూఢ విశ్వాసాలను ఖండించడం కనిపిస్తుంది. ఆ పని వేమన ఏనాడో చేశాడు. నూతనత్వం గోచరించాలి. శతకాల్లో కాళహస్తీశ్వర శతకం, దాశరథీ శతకం, ఆంధ్రనాయక శతకం వంటివి ఈనాటికీ పాఠకులను అలరిస్తుంటాయి. ఆధుకుల్లో విశ్వనాథవారి మా స్వామి, మోచర్ల రామకృష్ణయ్యగారి *శ్రీ కృష్ణశతకము* వంటివి వచ్చాయి. *విశ్వేశ్వర శతకం* ప్రధానంగా సంసారబాధా నివారణ కోసం రచించారు. రసాత్మకమైన పద్యాలు రచించారు విశ్వనాథవారు. వాటితో పోల్చితే ఈనాటి శతకాలు పేలవంగా వున్నాయని చెప్పవచ్చు. శతకాలు ఆత్మీయతను వ్యక్తపరచటానికి బాగా ఉపయోగపడే ప్రక్రియ. ఏ పద్యానికి ఆ పద్యమే రసాత్మకంగా ఉండాలి. పొడి మాటలు కనిపిస్తున్నాయి. పద్యం రాసే నేటి కవులు భావకవుల పద్య కవిత్వం చదివితే ఏ భావాన్ని అయినా అందంగా చెప్పే నేర్పు అలవడుతుంది. ఈ శతాబ్ది బృహత్కావ్యం '*తథాగతీయం*'. (పే 104) బుద్ధుని కథ. బౌద్ధం అంటే గిట్టని పట్టని వారు తెలుగునాట మిక్కుటం. ఆంధ్రదేశంలో 13వ శతాబ్ది వరకు బతికే ఉంది బౌద్ధం. బౌద్ధం కోసం కృషి చేసిన ఆంధ్రులు చాలామంది ఉన్నారు. ఈనాడు బౌద్ధాభిమానులు పెరుగుతున్నారు. పింగళి కాటూరి వారి *సౌందరనంద* కావ్యం ప్రసిద్ధి పొందింది. ఆచార్యుల వారు *సౌందర నందం* మీద చాలా రాసారు. కైలంకుషంగా కావ్యాన్ని పరిశీలించారు. *తథాగతీయంలో* పరమ లక్ష్యం ధర్మ ప్రబోధమే. రసం కన్నా ఇది వీరి దృష్టి లో వేయి రెట్లు గొప్పది అన్నారు. నిజానికి కావ్యంలో వుండవలసినది రసం గదా! బుద్ధుడు హేతువాది అనడం సమంజసం కాదు. బౌద్ధులనిర్వాణం, భగవద్గీత బ్రహ్మనిర్వాణం, ఉపనిషత్తుల ఆత్మసాక్షాత్కారం. నాగార్జునుని శూన్యం, పరిపూర్ణత్వం. జిడ్డు కృష్ణమూర్తి ఎల్లలు లేని ఎరుక- ఇవన్నీ పేర్లు మార్పు. ఏకత్వమే. బహిర్ముఖులకు నైతిక, ధ్ధార్మిక బోధ. అంతర్ముఖులకు తాత్విక బోధ. బౌద్ధ తత్వం గురించి ఆచార్యులవారు చేసిన వ్యాఖ్యలు నిష్పక్షపాతంగా ఉన్నాయి. ఆధునిక భారదేశావనికి బౌద్ధ సాహిత్యాన్ని తెలుగులోకి అనువదించుకోవలసిన

అవసరాన్ని గుర్తించి వెలుగులోకి తీసుకువస్తున్నారు. ఆనందబుద్ధ విహార్ ట్రస్ట్‌వారు కూడా చాలా గ్రంథాలు ప్రచురించారు. తేటగీతుల్లో పల్నాటి భారతం (పే 107) ప్రభాకర రెడ్డిగారు రాశారు. మళ్ళీ ఎందుకు పల్నాటి భారతం అనుకోవడం సహజం. పద్యం రాయగల శక్తి గలవారు కొత్త కథను తీసుకుని రాయవచ్చు గదా. శ్రీనాథుని పేరు మీద ద్విపద పల్నాటి భారతం ఉంది. తెలుగులోనే ఉన్నప్పుడు మళ్ళీ అదే రాయడం వల్ల పోల్చి చూసుకోవాల్సి వస్తుంది. ప్రాచీన కాలంలో కూడా పల్నాటి వీర కథ తెలుగువారిని పరవశింప చేసింది. పల్నాటి యుద్ధం 1176-1182 మధ్య అని మల్లంపల్లి సోమశేఖరశర్మగారు, అక్కిరాజు ఉమాకాంతం గారు 1178-1182 మధ్యా, పింగళి లక్ష్మీకాంతంగారు 1181-1182 లో సంభవించిందని నిశ్చయించారు. పదమూడవ శతాబ్దినాటికి పల్నాటి వీర చరిత్ర ద్విపద కావ్యంగా రూపొందింది. యథార్ధ గాధ కోసం పద్దెనిమిదేళ్ళు చరిత్ర పుటల్ని శోధించి ఇతి వృత్తాన్ని సిద్ధంచేసుకున్నారట ప్రభాకర రెడ్డిగారు. ఇదీ పద్దెనిమిది కావడం జయావహం అన్నారు ఆచార్యులవారు. పల్నాటి వీరచరిత్రలోని ఘట్టాలు ఎన్నో చెప్పటానికి సాధ్యం కాదు. ఆ ఘట్టాలను ఇరవై అయిదింటిని పదసాహిత్య పరిశోధకులు గుర్తించారు. లభిస్తున్న పల్నాటి వీర చరిత్రలో పదకొండు ప్రకరణాలే ఉన్నాయి. ఆంధ్ర సాహిత్య చరిత్రకు తెలిసినంతవరకు ఈ వీర చరిత్ర ప్రథమ కవిగా శ్రీనాథుడు కనపడతాడు. శ్రీనాథుడు తరువాత కోళ్ళ పోరు భాగాన్ని మల్లయ్య, కొమ్మరాజు యుద్ధాన్ని కొండయ్య రచించారు. మగిలిన ఏడు ప్రకరణాలను ఎవరు రచించారో చెప్పలేము. వారు అజ్ఞాత కవులు. 1861 ప్రాంతాల్లో ముదిగొండ వీరభద్ర కవి వీర భాగవతం రచించాడు. క్రీడాభిరామంలో పలనాటి యుద్ధానికి గల కారణాలు కనబడతాయి. నాయకురాలి దుష్టరాజనీతి, కోడి పోరు, చాపకూడు యుద్ధానికి కారణాలు. కోడి పోరు కూడా నాయకురాలి దుస్తంత్రమే కాబట్టి చివరకు బ్రహ్మ నాయని మత సాంఘిక సంస్కరణమూ నాయకురాలి కుటిల రాజనీతి పలనాటి యుద్ధకారణాలని నిగ్గు తేలుతుంది. ఉభయపక్షాలు కారంపూడి వద్ద కయ్యం చేశారు. చివరకు నలగామునకే విజయం లభించింది. వీరులెందరో ఈ దాయాదుల కలహంలో మరణించారు. ఈ యుద్ధం వలన ఆంధ్ర మండలేశ్వరులందరూ చితికిపోయారు. కాకతీయులైన మొదటి ప్రతాపరుద్రుడూ గణపతి దేవుడూ ఈ మండలికులను జయించి తెలుగువారినందరినీ ఒక గొడుగు కిందకు తెచ్చి మహాంధ్ర సామ్రాజ్యాన్ని స్థాపించారు. సోమశేఖర శర్మగారు చెప్పినట్టు మొదటి విశాలాంధ్రోద్యమం ఇదే. (పలనాటి వీర చరిత్ర వ్యాసం - నాగళ్ళ గురు ప్రసాదరావు). కావ్య కళా మర్మాలు ఎన్ని వున్నా శ్రీనాథుని పల్నాటి వీర చరిత్రకు దీటురాదు. ఏమైనా సాహసం చేశారు. పద్యకవులు ఇటువంటి సాహసం కాదు చేయవలసింది. ఆధునిక కథను తీసుకుని రాస్తే పడిన శ్రమకు ఫలితం వుంటుంది.

శేషేంద్రశర్మగారిని పరిచయం చేయవలసిన అవసరం లేదు. లబ్ధ ప్రతిష్ఠులు, పుంఖాను పుంఖంగా రచనలు చేశారు. కవి-విమర్శకుడు- పండితుడు ఈ ముగ్గురూ ఒక వ్యక్తిలో ఇమిడి వుండటం అరుదైన సంగతి అన్నారు. పద్యాలు రాసి రాసి వచన కవిత్వంలోకి వెళ్ళాడు. *ఆధునిక మహాభారతం* వచన కవిత్వం, *కవి సేన మేనిఫెస్టో ఆధునిక శాస్త్రాలంకార శాస్త్రం* శేషేంద్ర గారు కవిగా పార్టీ ఫిరాయించటం వల్ల విశ్వనాథ తరవాత పద్య ప్రక్రియ ఒక పెద్ద దిక్కులేనిదయ్యింది. ఒక పథికృత్తును దూరం చేసుకుంది. లేకపోతేనా పీడిత జన గాధతో ఒక మహాకావ్యం వచ్చి ఉండేది. చాలా పురస్కారాలు వచ్చాయి కూడా (పే118).

తొలి స్త్రీవాద కవిత్వం చంద్రగ్రహణం. రచయిత్రి కొలకలూరి స్వరూప రాణి. స్త్రీ వాదం ప్రారంభం కాని రోజుల్లో

వినిపించిన తీవ్ర స్వరం అన్నారు. (పే 126) విదేశీ 'ఆముక్త' ఏమిటా అని పాఠకుడు ఆసక్తితో చదువుతాడు. కోవెల సంపత్కుమారాచార్యుల వారు శ్రీకారం చుట్టింది ఆంధ్రావనిలో అయినా ముగింపు పలికింది అమెరికాలోనట. భక్తి ప్రధానమైనది గోదా దేవి కథ. మధుర భక్తికి రాధతో సాటి వచ్చిన రంగనాయకి. ఈవిడ పడ్డ విరహవేదనే ఆముక్త. తమిళ రచన నాచియార్ తిరుమొళి దీనికి ప్రేరణ. మనస్సు ఇంద్రియాల వైపు తిరిగితే కామం. అతీంద్రియ సత్తా వైపు తిరిగితే భక్తి. మనస్సును ఊర్ధ్వముఖం చేయాలి. మనసు దేని మీద దృష్టి నిలిపితే అదే అవుతుంది. సంపత్కుమార తొలినాళ్ళలో పద్యకవి. అటుపైన వచన కవి. చేతనావర్త కవుల్లో ఒకరు. వారి కావ్యం లోని మార్మికతలను వివరించారు, కోవెల సుప్రసన్నాచార్యులవారి *శతాంకుర* కావ్యంమీద స్రవంతిలో నా భావాలను విమర్శించారొకరు. ఆధ్యాత్మిక కావ్యాలు రాసేటప్పుడు ప్రణయం కాదు ప్రణవం ఉండాలన్నారు. జంతుప్రవృత్తి ఎక్కడ ఆగిపోతుందో అక్కడ దివ్య భావన ఆరంభమవుతుందని రామకృష్ణులవారన్నారు. ఆధునికులు సంస్కృతాంధ్రాంగ్లాలు చదువుకుని సంప్రదాయాన్ని అర్థం చేసుకోకపోతే ఎలా? తెలియని వాళ్ళు కామిగాని వాడు మోక్షగామికాడని కామమే వర్ణిస్తే సరిపోదు. చలంగారి 'సుధ' కావ్యంలో 'నఖక్షతాలు' పదంవాడినందుకు తప్పపట్టాల్సి వచ్చింది. ఆధ్యాత్మిక కావ్యం గనుక . సంపత్కరాచార్యుల వారి కవిత్వంలోని సొగసులను ఛందస్సుల ప్రయోగాలను తెలిపి మనల్ని కూడా కావ్యాన్ని చదివించేట్టు చేయగలిగారు. (పే 134).

వీరరసమూర్తి పురుషోత్తమ చక్రవర్తి ని గురించి మేడసాని మోహన్ రాసిన కావ్యం విమర్శకు గురికాక తప్పలేదు. వీరరసానికి స్థాయీ భావం ఉత్సాహం అంటారు. భాషా సంపదను దుబారా చేసారు. ఆశువుకు అతవాటు పడిన జీవుడు పద్యాన్ని పరుగులు తీయిస్తాడే కాని పదాల వాడకంలో పొదుపూ మదుపూ వగైరాలను చూడడు. ఆవేశమే కాని ఆలోచన వుండదని భావం.(పే 148).

రాళ్ళ బండి కవితా ప్రసాద్‌గారు అవధానాలు చేసారు. *కాదంబిని* అనే కావ్యం వెలువరించారు. ప్రసాద్‌గారు శాక్తేయ మార్గానికి చెందినవారు. అమ్మవారిని నిరంతరం ఉపాసిస్తూ మనశ్శాంతిని పొందుతున్న అదృష్టవంతుడు. ఈ అవధాని గారు నిజంగానే అదృష్టవంతుడు. అచార్యుల వారు కావ్యాంలోని మూల తత్త్వాన్ని వివరించారు. తప్పులు ఎక్కువ లేవు. మన వేదాంత సంప్రదాయంలో శక్తిని గురించిన ప్రసంగం లేదంటారు. శృతి 'పురుషాన్న పరంకించిత్ ' పురుషునకు వేరుగా ఏదీ లేదు అని చెప్పటం వలన వేదాంత శక్తిని చెప్పలేదు. తంత్ర శాస్త్రం శక్తికి మాత్రమే ప్రాధాన్యత నిచ్చింది. వేదాంతం శక్తిని పక్కకు నెట్టి పురుషునకు కిరీటం పెడితే తంత్రం పురుషుడిని మూలకు నెట్టి శక్తికి పట్టం కట్టింది. అసలు దేవీ పూజ భారతీయ సంప్రదాయమా కాదా అనే మీమాంసికులూ వున్నారు.

బండ్లమూడి వారి పసిడి మాటలను విప్పి చూపించారు. ఆచార్య తిరుమల వారికి కావ్య రచన తపోవృత్తి. ప్రతిఖండికను గురించి వక్తవ్యం ఏదో ఒకటి వుంది. అన్నీ ఆలోచనామృతాలే. అన్నీ ఆస్వాదనీయాలే. సాహిత్య తపస్సులో ఊర్ధ్వముఖంగా పయనించాలి మరి. మళ్ళీ కొత్త కావ్యం ఆచార్యుల చేతికి వస్తే గాని తపశ్శక్తి తెలియదు. మంజీరనాదాలు శ్రుతి తప్పినాయన్నారు.

భారతీయ తత్త్వవేత్తలు మానవజీవితానికి ధర్మార్థ కామమోక్షాలను పరమార్థాలుగా నిర్దేశించారు. అర్థకామాల స్వభావాన్నీ ప్రాధాన్యాన్నీ గుర్తించి అవి ప్రవహించవలసిన తీరుకు చెలియ కట్టల్లాగ ఆద్యంతాలతో

ధర్మమోక్షాలను బిగించారు. ధర్మ బద్ధంగా అర్థకామాలను సేవించి ముక్తి పొందడమే మానవ జన్మకు చరితార్థత అని ఒక ఆదర్శ సూత్రాన్ని సారాంశంగా తేల్చారు. పుణ్య పాపాలు. స్వర్గ నరకాలూ కర్మఫలాలూ జన్మ పరంపరలూ వగైరా మేకు బిగుంపులన్నీ చేసారు. అయితే వేల సంవత్సరాల ఆచరణలో జరిగిన వీటి దుర్వినియోగాన్ని ఈ శతాబ్దం గుర్తించి తీవ్రంగా స్పందించింది. (పే 174). మహాభారతంలోనే అర్థ కామాలకిచ్చిన ప్రాధాన్యత వల్లనే ఈ ధర్మాన్ని వదిలేయడం వల్లనే రాజ్య పతనానికి కారణం అని గుర్తించారు. శ్రమకూ కృషికీ వైముఖ్యం ఏ జాతి కైనా ఏ కాలంలోనైనా మేలు చెయ్యదన్నారు. ఆధునక పద్య కవిరాజు (పే176) త్రిపురనేని రామస్వామి చౌదరిని గురించి చాలా విషయాలు తెలియచేసారు. మహాకవికి పై మెట్టు కవిరాజు. ఒక మహా కావ్యం రాసి మహాకవిగా లోకంలో స్థిర పడ్డాక ఇంకా రచనా వ్యాసంగాన్ని కొనసాగిస్తూ వస్తు రూపంగానో ప్రక్రియా పరంగానో ప్రయోగాలు చేసి కొత్త వరవడిని సృష్టిస్తే అతడిని కవిరాజు అనాలి. పురాణాల్లో కనిపించు అనౌచిత్యాలను అసంగతత్వాలనూ తీవ్రంగా ప్రశ్నించిన పద్య కవి ఈయన. ప్రశ్నిండమే కాదు,చక్కదిద్దే ప్రయత్నంగా సూత పురాణం వెలయించిన మహాకవి. ప్రక్రియ పాతదే అయినా భావపరంగా లేదా వస్తుపరంగా ఒక వినూత్నత్వానికి దారి వేసి కవిరాజు బిరుదును సార్థకం చేసుకున్నారు. భావ విప్లవ విధాత అని ప్రశంసలు అందుకున్నారు. సుత-సూత శతాబ్దాలను వివరిస్తూ ధర్మ సంతతి సుతులు. రాజులకుఉంపుడు గత్తెల వల్ల కలిగిన పుత్రులు - సూతులు. వీరు దేశాటన చేసి విన్నదవీ కన్నవీ శ్రోతలకు వినిపించడమే సూత సంప్రదాయమని ఇరావతీ కార్వే యుగాంతంలో తెలియచేశారన్నారు. సూతుడంటే స్తోత్ర పాఠకుడని అర్థం ఉంది. సూతుడంటే వందిమాగధుల్లో వంది వంటివాడు. భారతీయ సారస్వత సంప్రదాయం మంత్ర సంప్రదాయం. సూత సంప్రదాయం . శ్రమణ సంప్రదాయం, వేదాల్లోని దాన స్తుతులూ, నారాశంసి ఋక్కులూ, గాథలు, దాశరాజ్ఞ యుద్ధమూ ఊర్వశీ పూరూరవసంవాదమూ సూతసంప్రదాయమేనంటారు.

మహాభారతాన్ని ప్రాచ్య పాశ్చాంత్య విద్వాంసులు పరిశోధించి గ్రంథాలు రాసారు. భండార్కర్ ప్రాచ్య పరిశోధనా సంస్థవారు మహాభారత సంశోధిత ముద్రణ వెలువరించింది. ఒక్కో పర్వాన్ని ఒక్కో మహాపండితుడు పరిష్కరించాడు. నన్నయ తిక్కన ల మహాభారతాలను కూడా పండితులు ప్రామాణికంగా స్వీకరించారు. కవిరాజుగారు ఆంగ్లం కూడా చదువుకున్న వారు కావడం వలన నూతనదృక్కోణంతో దుష్ట సంస్కృతి మీద దాడి చేసారు. కొందరు మహనీయులు బయలుదేరి ఇట్టి కథలకు అంతరార్థము బోధింప సమకట్టుదురు అని అన్నాడంటే ఆయనకు అంతరార్థము కొంతవరకైనా తెలిసే ఉంటుంది. కాని ఆయన ఉద్యమ లక్ష్యం వేరు.

ఏదీ నిర్దుష్టమూ కాదు. ఏదీ నిర్గుణమూ కాదని ఆచార్యుల తీర్పు. భావవిప్లవాన్ని తెలుగు ప్రక్రియలో కవితామయంగా తెచ్చిన మహాకవిగా త్రిపురనేని రామస్వామి చౌదరిగారు చెళ్ళ పిళ్ళ వెంకట శాస్త్రిగారి శిష్యుడు,. భారతీయ సంప్రదాయానికి ప్రతినిధిగా పుంఖాను పుంఖ రచనలు చేసి రామాయణ కావ్యాన్ని రాసిన విశ్వనాథ సత్యనారాయణ కూడా వెంకట శాస్త్రిగారి శిష్యుడే. ఈ శతాబ్దాన్ని పద్యప్రక్రియలో ఈ శిష్యులిద్దరూ తమ గురువులకు అంకింతంగా దఖలు పరిచినట్లు తోస్తుందని ముగించారు. ఆస్తికతను గాని నాస్తికతను గాని ప్రబోధించడానికి పద్యం అడ్డుకాదు అని నిరూపించారు. కరుణవేది కవి చక్రవర్తి గుర్రం జాషువా. 1920 నుండి 1970 దాకా జాషువా కవిత్వం రాసారు. శృంగారం గొప్పదంటారు కాని కరుణ రసం అన్నిటికంటే గొప్పది. ఆంధ్ర దేశంలో సామాజిక ఉద్యమాలన్నీ ఆయన కాలంలో జరిగినవే. జాతీయోద్యమం, ఆంధ్రోద్యమం,

నాస్తికోద్యమం, హేతువాదోద్యమం, బ్రహ్మ సమాజోద్యమం, సామ్యవాదోద్యమం అన్నీ ఆయన కవితా చైతాన్యానికి స్ఫూర్తిదాయకాలే.

సంపూర్ణ మహాకావ్యాలు రాయక పోయినా మహాకవిగా ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకున్నాడు. రాసిన ప్రతి ఖండికలో ప్రతి ఖండకావ్యంలో ప్రతి ఘుకృతిలో కరుణరసాన్ని పండించాడు. కరుణామయులు కండి, కరుణామయుడు కరుణిస్తాడు అనీ మానవులు అనిపించుకోవాలి అంటే ఇదొక్కటే మార్గం అనీ అక్షరాలా ఉపదేశించాడు. తన కవితా కుమారిని ఎగాదిగా చూసి కులమేమిటి అని అడిగి పెదవి విరిచిన వారి మీదనైనా జాలి పడ్డాడే తప్ప కత్తులు దుయ్యలేదు. దూసి వుంటే బాగుండేది అనడం వేరే సంగతి గానీ ఇంతటి కరుణ వేది ఈ కవి (పే 179) విమర్శకులు అంతగా పట్టించుకోని అనాథ- స్వప్న కథలలోని కవి అంతరంగం మరింత కవితా శిల్ప మహితంగా ఉందని తెలియ చేసారు. పద్యాలు రాసిన మహాకవుల్లో తమనాటి సమాజంలోని వస్తు విస్తృతిని చూపినవారు విశ్వనాథ,జాషువాలే. జాషువా తన జీవితంలో అనుభవించిన వేదనలు కులానికి సంబంధించిన అణచివేత. పేదరికానికి సంబంధించిన అణచివేత. దారిద్ర్యాన్ని, కులభేదాన్ని కూడా చీల్చి మనిషిగా నిరూపించుకున్నారు. అనాధ-స్వప్న కథల్లోని విశేషాలను తెలియచేసారు. చక్కని సందేశాలిచ్చే కథా కావ్యాలు రావాలి.

కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు సాహితీ క్షేత్రంలో చేయని వ్యవసాయం లేదు. పండించని పంట లేదు. అందుకే ఆయన మహాకవి. ఒకటి రెండు వచన కవితలు కూడా రాశారట.చూద్దాం విశ్వనాథ భావాలు నచ్చకపోవచ్చు కాని కవిత్వాన్ని మెచ్చకుండా వుండలేం. రసమార్గం పట్టిన కవికి కథా కథనం మీద ప్రత్యేక దృష్టీ ప్రత్యేక శ్రద్ధా వుంటాయంటారు. వీరి రచనల్లో తలమానికమైనది శ్రీమద్రామాయణ కల్పవృక్షమే. నన్ను చదివితే అందరినీ చదివినట్టేనని చెప్పడం ఎంత ఆత్మవిశ్వాసం ; విశ్వనాధ వారి మీద వచ్చినన్ని విమర్శలు ఏ కవి మీదా రాలేదు. ఇప్పడు వారి రచనలోని గొప్పతనాన్ని చాటి చెపుతున్నారు. కథన శిల్పంలోని ఒక కోణాన్ని రేఖామాత్రంగా ఆచార్యులవారు స్పృశించారు.(పే183).

గరికపాటి వారి సరదా కవితలు , ప్రచార కవితలు గురించి రాసారు. వేముగంటి నరసింహాచార్యులు భావతరంగిణిని పరిచయం చేస్తూ ప్రకృతిని మానవీకరిస్తూ ప్రకృతినుంచి ఎప్పటికప్పడు పునర్నవీకరణను పొందుతున్న కవికీ కవిత్వానికీ ఢోకా లేదన్నారు. (194) కావ్యశ్రీ నారాయణరావుగారు కోనసీమ కావ్యం రాసారు. ఈ పుస్తకం మొదటి కావ్య పరిచయం వీరిదే బ్రహ్మాస్త్రాలు. ప్రకృతి వర్ణనల్లో నారాయణరావుగారి సరసత , కాల్పనికత ప్రాచీన కావ్యానుశీలన పాఠకులను మురిపిస్తాయన్నారు. (198)

నన్నయ దృష్టిలో సూక్తి(213) ని గురించి మంచి వ్యాసం రాసారు. ప్రాచీన కవులు తమ కవిత్వాన్ని గురించి వారే తెలియచేసారు. ప్రసన్న కథాకవితార్థ యుక్తి, అక్షర రమ్యత, సూక్తి నిధిత్వం మీద కూడా పరిశోధనలు జరిగాయి. నీతి వాక్యం అనే అర్థం చెప్పారు. నీతి వాక్యాలు కవిత్వం కాదు. సూక్తి పదం నిఘంటువులకు ఎక్కలేదు. తెనాలి రామకృష్ణుడు కవి జన సహకారావళీ వసంతోత్సవ సూక్తి నిధిని అన్నాడు. (పాండురంగ -1-22) కవిజనులనే మామిడి చెట్లను వసంతంలా చిగురింపజేసే సూక్తుల నిధిని అంటున్నాడు. ఎర్రనలో శ్రీనాధుడు గుర్తించిన సూక్తి వైచిత్రి కూడా ఇలాంటిదే. 'సు'కి బదులుగా చతుర అనీ, ఉక్తికి బదులుగా వచస్సు అనీ పర్యాయపదాలు పొదిగి పెద్దన గారు చతురవచోనిధి అన్నాడు. మధురవచో గుంభన అ ని నిర్వచనోత్తర

రామాయణంలో తిక్కన. (పే 215) సూక్తి ని గురించిన సూక్తులు.

నోరి వారనగానే మనకు వారి చారిత్ర కనవలలు గుర్తొస్తాయి. కవిగా పాఠకులకు అంతగా తెలియదు. చాలా కాలం కిందట నేను రేపల్లె వెళ్ళినపుడు నోరివారిని దర్శించాను. గుర్తుగా ఏదైనా ఒక పుస్తకమైనా యిస్తారేమోననుకున్నాను. భారతి పత్రికలో నా వ్యాసం ఏదో రాశానని చెప్పాను. పండితకవులు. (216). కొత్త కొత్త కవితా సౌరభాలను, గోదావరి సొగసులను సమీక్షించారు. గోదావరిమీద మంచి కవితలు వచ్చాయి. వేదుల వారి గౌతమి కోకిల. కృష్ణవేణిని కన్యతోను, గోదావరిని ముత్తైదువతోను పోల్చారు రాయప్రోలు వారు. ఎక్కడ తప్పుగా అర్థం చేసుకుంటారో అనీ, తమ కున్న పాండిత్యాన్ని తెలియజేయాలనే ఉబలాటం కొద్దీ సుదీర్ఘమైన పీఠికలు తమ కావ్యాలకు రాసుకుంటారు. చాదస్తాలేవీ లేవంటూనే ప్రతి చిన్న పుస్తకానికి చేంతాడులా పీఠికలు రాస్తారు కొందరు. కావ్యం చదవనక్కరలేదు. పీఠిక చదివితే చాలు. సమీక్షకుడు కావ్యం చదివి సమీక్ష రాసిన తరవాత పీఠిక చదవాలి. గండవరపు వారి కళాకేళి మీద రాసిన వ్యాసంలో ఆచార్యుల వారు చీవాట్లు పెట్టాల్సి వచ్చింది. (234).

బొమ్మ కంటి శ్రీనివాసాచార్యులు పండితులు. విజ్ఞాన సర్వస్వాల నిర్మాణంలో నిపుణుడుగా లోకానికి చిరపరిచితులు. ఎమెస్కో వారి ఆంధ్ర సాహిత్యంలో అనర్ఘరత్నాలకు సంపాదకులుగా కొన్నింటికి విశ్వనాధవారూ, మరికొన్నింటికి బొమ్మకంటివారూ పీఠికలు రాసారు. పద్యకవిత  రచనల్ని ఓవరి పేరుతో 1982లో ప్రచురించారు. ఓవరి అంటే లోపలి గది అని అర్థం. శ్రీశ్రీ గారు చివరి పీఠిక సమకూర్చారు.ఉక్తి వైచిత్రి అనేది ప్రధానంగా వీరి కవిత్వానికి ఆయువు పట్టు అన్నారు (256).

మధుకేళి కల్పిత కథా కావ్యం. ఇది అన్యాపదేశ కావ్యం. రచయిత అనంతపద్మనాభ ప్రసాదుగారు. అమరావతి జమిందారు రాజా వాసిరెడ్డి వారితో, చల్లపల్లి జమీందారులతో చిరుమామిళ్ళవారితో ఈ కవి గారికి బంధుత్వాలున్నాయి. సంపన్న కుటుంబీకులు, కవిత్వం అలవడటం విశేషం.

ఈశ్వరా అని మకుటం పెట్టుకుని రకరకాల సామాజిక విషయాల మీద తన స్పందనలను కవితా మయంగా అందించిన హుసేన్ సాహెబ్ గారి శతక పరిచయం తో పద్యారామం సమాప్తం.

చివరలో నాలుగు అనుబంధాలను చేర్చారు.

ఫ్యామిలీ  ట్రైప్ కవిసమ్మేళనం. హాస్య రసాన్ని పండించారు. అవధాన ప్రక్రియచావు లేనిదని తీర్మానించారు. ఇటీవల ఈ రంగంలో పోటీ పెరిగి కొన్నిఅనారోగ్య పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. సహస్రమనీ ద్విసహస్రమనీ అలవికాని బరువులు ఎత్తుకుని నియమోల్లంఘన చేస్తున్నారు. ఇది చాలా ప్రమాద కరమని హెచ్చరించారు.

కవిత్వానికి ఛందస్సు. అలంకారాలు ఆభరణాలా? లేక బంధాలా? అన్న ప్రశ్నకు అలంకారాలు లేకుండా కవిత్వం అనూహ్యం అన్నారు. ఛందస్సు అంటారా అది అనివార్యం కాదు. కానీ అదనపు సొగసు. అభ్యాసమూ కృషీ చెయ్యనివారికి శ్రమ కృతాలసబుద్ధులకు అది బంధనం.  వచన కవిత్వాన్ని గట్టిగా సమర్థిస్తూ,రాయమని ప్రోత్సహిస్తూ అనేక వ్యాసాలు రాసిన వారు శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారు. కవిత్వానికి ప్రయోజనము,

చదువరికి అనుభవమూ తద్వారా ఆనందమూ కలగడము. అలంకారపు గురి మనస్సుకి. హృదయానికి కాదన్నారు శ్రీపాద వారు. నన్నయగారి ఉదంకుని నాగస్తవము , కద్రువ ప్రార్ధన, దేవయాని వేడికోలూ వంటి చోట్ల అలంకారాలుండవు. పెద్దనగారి అగ్నిస్తవము, చెలికత్తెల ఊరడింపులలో అలంకారాలుండవు. తిక్కనగారి రసాభ్యుచిత బంధాలలో అలంకారాలు వాడరు. నాచన సోముని ఊర్వశీ నరక సంవాదము, శ్రీనాధుని దమయంతీ నల సంవాదము పెద్దన వరూధినీ ప్రవర సంవాదము - నిరలంకార నిసర్గ కవిత్వ శోభకు ఎన్నైనా ఉదాహరణలివ్వవచ్చారంటారు. అలంకారం కవిత్వానికి తప్పని సరి కాదు అని నిరూపించడానికి శ్రీపాదవారి వాదన.

ఆచార్యులవారు పద్యకవిత్వ అనుకూలురు. వచన కవిత్వ వ్యతిరేకులనుకోవడం పొరపాటు. మంచి కవిత్వాన్ని మెచ్చుకుంటారు. అయితే పద్యకవిత్వం తాలూకు శాశ్వతత్వం, ప్రచారం, ఆదరణ వచన కవిత్వానికి ఆశించడం అన్యాయం అంటున్నారు.

దేవీ భాగవతాన్ని తెలుగులోకి అనువదించారు ఆచార్యులవారు.శివుడు శక్తితో కూడినప్పడే సృష్టించడానికి సమర్ధుడవుతాడు. ఆశక్తి లేకపోతే కదలనైనా కదలలేడు, అని *సౌందర్యలహరిలో* శంకరాచార్యులు ప్రధమ శ్లోకంలో అన్నాడు. 'పోతన' ముగురమ్మల మూలపుటమ్మ' అన్నాడు. అరవిందులు కూడా అమ్మను గురించి రాశారు. ముందు పురుషుడే. పురుషసూక్తం. తరువాత ప్రకృతి 'అమ్మ'.

ఆచార్యుల వారి పద్యారామం అంతా పరిశీలన చేస్తూ కలిగిన భావాలను మీ ముందు వుంచుతున్నాను. ఆచార్యులవారి కలం, గళం బలమైనవి. నా పీకల నుండి వెలువడిన అక్షరాలు వాటి ముందు వెలవెల బోతున్నవని నాకు తెలుసు. అయినా సాహసించాను. సంస్కృతాంధ్రాంగ్లాలను క్షుణ్ణంగా చదివినవారు. బహు గ్రంధ పఠనమూ బహుగ్రంధ రచనా చేసినవారు. ఇంతటి ప్రతిభ వున్నా నిగర్వి. అహంకరించి పలికిన పలుకులు కనిపించవు.

పద్య రచనలకు ఆదరణ తగ్గలేదని, పద్యం చావలేదని నిరూపించారు. వచన కవిత్వం జోలికి పోలేదు గనుక దానికి వ్యతిరేకులన్న అపోహను వారు తొలగించుకోవాలని కోరుకుంటున్నాను. నేను రాసింది సమీక్షల మీద సమీక్ష. నేను కూడా ఆచార్యుల వారితో పాటు సమీక్షకుడిగా మారిపోయానా అనిపించింది. ఆచార్యులవారి అపార వైదుష్యాన్ని, విమర్శనాపాటవాన్ని, సహృదయత్వాన్ని తెలియచేయాలనే ఉద్దేశం. ఈ విషయంలో ఎంత వరకు కృతకృత్యుడనయ్యానో పాఠకులే నిర్ణయించాలి. కొంతైనా సంతృప్తి కలిగిస్తే చాలు. ధన్యుణ్ణి.

back to book of the week home page

❖ఈ విశేష సమీక్షా వ్యాసం *ది గ్రేటర్ వాషింగ్టన్ తెలుగు కల్చరల్ సొసైటీ* వదాన్య సౌజన్యంతోఅందించబడింది.